# ధర్మతల్లి

శ్రీమతి చుండూరి రమాదేవిగారు

ఆగుడిసెలో కాపురముండేది నేనూ, నాఅన్న వీరడూ, మాతండ్రీనూ. మా అమ్మ లేకపోవడంచేత, నేను చిన్నదాన్నవడంచేత కలిగినదాల్లోనే కాస్త గారాబంగా పెంచేవాడు మాబాబు. నేను ఏటికెళ్లి చిన్నకడవ నెత్తిని పెట్టుకొస్తూంటే నే నెక్క డలసిపోతానో అని ఎదురొచ్చి చేతులలో కడవ అందుకొనేవాడు. నేను కంటికి అగపడని ఘడియ యుగంలాగుండేది. మా అన్నకూడ చెమటోడ్చి, కూలిపని చేసివచ్చి నాతో కాస్సేపు మాటలు చెప్పకుండా గంజి తాగేవాడు కాడు. యిల్లా గడచిపోతున్నాయి రోజులు. "పిల్లలు పెద్దవాళ్లైనారు, నాబాధ్యత తీరింది, యింకా సంసారలంపట మెందుక"ని కాబోలు-హటాత్తుగా కలరావచ్చి, కాలంచేశాడు మాబాబు.

నాకు పిచ్చెత్తింది. మాఅన్న పనిలోకెడితే ఒక్కదానికి తోచేదికాదు. మా అన్న, నేనూ ఒకరికొకరు ధైర్యము చెప్పుకొంటూ కొన్నాళ్లకు ఆదుఃఖము మరచిపోయాం. భగవంతుడు మాత్రం మమ్మల్ని మరువలేదు.

పదిరోజులనుండి వూళ్లో అమ్మవారు తాండవమాడుతోంది. ఊరంతా అల్లకల్లోలంగావుంది. ఇప్పుడు చూసినవారు కాస్సేపటికి కానరావటంలేదు. చేసే జాతరలు చేస్తున్నారు. వేసే బలులు వేస్తున్నారు. పెట్టే నైవేద్యాలు యింటింటా పెడుతున్నారు. కాని ఆ తల్లికిమాత్రం అనుగ్రహం కలుగలా. మూడురోజులు యిట్లు ముమ్మరంగావుంది. తర్వాత నాలుగురోజుల్నుండీ అణగిపోయింది. ఎక్కడోగాని ఆమాట వినపడ్డంలేదు. కాని నూవంతు మిగిలిపోయిందని కాబోలు మాఅన్నకుకూడ వాంతులు ప్రారంభించాయి. "పూజారి పాపయ్యగారైనా కనికరించి ఒకమాత్ర యివ్వకపోతారా" అని వెడుతున్నానన్నమాటేగాని మనస్సులోలేదు. తలవంచుకొని మాస్థితి ఆలోచించుకుంటూ వెడుతున్నా. ఇంతలో "ఛీ! మాలముండా! కళ్లు కనపడవా! బ్రాహ్మణవీధిలో ప్రవేశించటమే కాకుండా వెధవముండని మణ్ణీళ్లు తెచ్చుకొంటూంటే, మీదిమీది కొస్తావా! మాయదారి స్వరాజ్యం వచ్చిందని మండిపోతున్నావేం!" అనే కేకలువిని తలెత్తి చూచేటప్పటికి దూరంలో బిందెడు నీళ్లు పారబోసి వెనుకకువెళ్లే వితంతు వగుపడ్డది.

'అయ్యో! మమ్మ ల్నెంతహీనంగా చూస్తున్నారు! మా కిక ఉన్నతిలేదు కాబోలు! అని ఆలోచిస్తూ పాపయ్యగారింటికెళ్లి అయనను వేడుకొంటే పదిరూపాయలు నుందిచ్చి మాట్లాడమన్నాడు. నా తలమీద పిడుగుపడ్డట్లయింది. పదిరూపాయలు ఎక్కడతేను! రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో మా అన్నకూడా పడిపోయాడు. నేనా ఆడదాన్ని! డబ్బు

యిచ్చుకోలేము. బాబూ! కనికరించాలని వేడుకొంటే నల్లరాయైనా కరుగుతుందిగాని పాపయ్యగారి హృదయంమాత్రం కరుగలా. ఇల్లు అమ్మేసి పదిరూపాయలూ తెచ్చి స్తేనే గాని మందిచ్చాడు కాదు పాపయ్యగారు. నిలువనీడలేక చెట్లక్రింద ఎండనక, వానన నిలువవలసివచ్చింది. మా అన్నకు జబ్బు తగ్గుతే అదే పదివేలనిపించింది. ఆ మా రెమ్మతల్లి దయవల్ల తగ్గుమొఖం పట్టింది. పథ్యం పెట్టుటకైనా చేతులో డబ్బులేదు. ఆకలితో అల్లాడిపోతున్నాడు మాఅన్న. మాఅన్న జబ్బుతో నీరసించిపోయాను. నిద్రాహారాలు లేవు. మండు వేసంగిఎండ. అలవాటులేని పని. ఎక్కడైనా గుప్పెడు గింజ లడుక్కునివచ్చి గంజి కాద్దామని బయలుదేరాను. సంపన్నులంతా భోజనాలయి తలుపులు బిగించేశారు. లోకం యెల్లాపోతే వారికేం? వూరంతా తిరిగినా ఒక్క కబళమయినా దొరకలా! నాకు కూడా ఆకలి దహించుకుపోతోంది. నిల్చునే శక్తిలేదు. మాఅన్నస్థితి మనస్సు కలిచేస్తోంది. నాకు కేకేసేశక్తిలేక, ఒక అరుగుమీద కూలబడ్డాను. స్పృహ తప్పింది.

కళ్లుతెరచి చూసేటప్పటికి నాదగ్గిర కూచొని ఒక పుణ్యాత్మురాలు నా నోటిలో అన్నరసం పోస్తోంది. తెప్పిరిల్లి నిర్ఘాంతపోయాను. 'అమ్మా! నేను మాలదాన్ని' అన్నాను. 'అయితేనేమీ పిచ్చిదానా! భగవంతుడుచేసే సృష్టిలో కులభేదములున్నాయా! మనుష్యులు తెచ్చిపెట్టుకొన్నవే గాని!' అంటూ కళ్లుమూసుకొని కొంచెము సేపు పరుండమని హెచ్చరించింది ఆ పుణ్యాత్మురాలు. ఆమె పోసిన జావ అమృతం లాగున తాగేశాను. కొంచెము స్పృహ వచ్చి కూచోటానికి శక్తివచ్చింది. లేచి కూర్చున్నా. ఆ బ్రాహ్మణవితంతువ మా స్థితినిగురించి చాలాసార్లు గుచ్చిగుచ్చి అడిగింది. చెప్పక తప్పిందికాదు. మా సంగతంతయు, పూసగ్రుచ్చినట్లు చెప్పేశాను. వింటున్నంతసేపు ఆమెకంటినుండి నీళ్లు కారుతూనే ఉన్నాయి. 'ఇంత చిన్నతనంలో నీ కెన్నికష్టాలే' అంటూ ఇంట్లో కెళ్లి ఇంతన్నం, కూరపట్టుకొచ్చి, మీ అన్నకుపెట్టి నీ వింత తినమని ఒళ్లోవేసింది. ఆమెకు నాకృతజ్ఞత ఎట్లాచెప్పాలో తెలియలేదు. నమస్కారంచేసి ఆ చల్లనితల్లిని తలచుకుంటూ మా అన్నదగ్గరకు బయలుదేరాను. మా అన్నకు ఆ తల్లిపెట్టిన అన్నం పెట్టాను. కొంచెం సేదదీరిన తర్వాత ఆ పుణ్యరాలి కథంతా మాఅన్నకు చెప్పాను. మాఅన్న "ఆమె మానవస్త్రీ కాదు. మన పాలిటి ధర్మదేవత" అని చేతులు జోడించాడు. మర్నాడు ఆతల్లి మాఅన్నకు, నాకూ కొద్దిరోజులవరుకు సరిపోయే బియ్యము పంపించింది. మళ్లీ మాఅన్న కూలిపనిలో కెళ్లేదాకా సరిపోయినవి. ఏదోమాదిరిగా మాఅన్న కూలిపని చేసుకొని తెచ్చే డబ్బువల్ల జీవిస్తున్నాం. లోకంలో యిటువంటి ధర్మతల్లులున్నారు క్రూర జలచరముల కాకరమైన సముద్రమున మౌక్తికములూ, మణులూ వున్నట్లు.